క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గంధం ఉరుసు



గంధం ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణ సమీపంలోని కొండపై వెలసిన హజరత్ సయ్యద్ జాఫర్ షా వలి దర్గా ఉరుసులో భాగంగా రెండోరోజు సోమవారం గంధం (సంధల్) కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం దర్గాలో ప్రత్యేక ఫాతేహా పఠించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి దర్గాలో ఖావాలీదార్‌లైనా ఆఫ్రీన్ సుల్తానా, తబరీజ్ ఖాన్‌తో జరిగిన ఖవ్వాలి ఆకట్టుకుంది. మంగళవారం తెల్లవారుజామున షంషీర్ ఉత్సవం, బుధవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ



ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న డీఎం రమేష్‌రెడ్డి

కణేకల్లు: కణేకల్లులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను సివిల్ సప్లయి డీఎం రమేష్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, కందిబేడలు, చెక్కర నిల్వపై ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని చౌకధాన్య డిపోలకు నిత్యావసర సరుకులను సకాలంలో సరఫరా చేయాలని డీఎం ఆదేశించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

శెట్టూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో 10 రోజులపాటు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు తెలిపారు. మంగళవారం నుంచి 20వతేదీ వరకు చెర్లోపల్లి ఉన్నత పాఠశాలలోను ఆధార్ క్యాంపు ఉంటుందన్నారు. 21న లక్ష్మంపల్లి ఉన్నత పాఠశాల, 24, 25 తేదీల్లో ఉన్నత పాఠశాల కనుకూరు, 27, 28 తేదీల్లో ములకలేడు ఉన్నత పాఠశాలలో ఆధార్ క్యాంపులు ఉంటాయని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు నియంత్రించాలి



కళ్యాణదుర్గంలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం- అనంతపురం, రాయదుర్గం వెళ్లే రహదారిలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పట్టణసీఐ యువరాజ్ సోమవారం పరిశీలించారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. వాహనదారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఉన్న చోట వాహనాలు నిమ్మదిగా వెళ్లాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు.

19, 20 తేదీల్లో ఇంటర్వ్యూలు

రాయదుర్గంటౌన్: వివిధ కార్పొరేషన్ల రుణాలు మంజూరుకు ఈనెల 19,20 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. స్వయం ఉపాధి పథకం కింద ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో రిజిష్టర్ చేసుకున్న వారికి మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఇంటర్వ్యూలకు ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు కుల, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా, ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని బ్రహ్మయ్య గుడి వద్ద సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఎనుములదొడ్డికి చెందిన శంకరయ్య, చెర్లోపల్లికి చెందిన చెన్నారెడ్డి కళ్యాణదుర్గం నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బ్రహ్మయ్య గుడి వద్ద చెన్నారెడ్డి ద్విచక్ర వాహనాన్ని శంకరయ్య వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చెన్నరెడ్డి, శంకరయ్య గాయాపడ్డారు. స్థానికులు వెంటనే సీహెచ్‌సీకి తరలించారు.

నేడు జిల్లాకు మైనార్టీ సంక్షేమశాఖ ప్రభుత్వ సలహాదారుడు

అనంతపురం రూరల్: మైనార్టీ సంక్షేమశాఖ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ మంగళవారం జిల్లాకు రానున్నట్లు మైనార్టీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కళ్యాణదుర్గంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారన్నారు. సాయంత్రం 3 గంటలకు అనంతపురంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం అవుతారని పేర్కొన్నారు.

అరాచక పాలనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గత ప్రభుత్వ హయాంలో అన్ని హంగులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభానికి నోచుకోలేదు. స్వయానా ఆర్థిక మంత్రి ఇలాకాలో ప్రభుత్వ పాలనా కార్యక్రమాలకు వినియోగించాల్సిన నూతన భవనాలు నిరుపయోగంగా ఉంచారు. దీంతో ఆకతాయిలకు ఆవాసాలుగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

– ఉరవకొండ:



అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారిన మోపిడి ఆరోగ్య కేంద్ర భవనం

అరాచకం.. ఆకతాయిలకు ఆవాసం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన మోపిడి ఆరోగ్య కేంద్రం
- భవనం ప్రారంభించకపోవడంతో వ్యభిచార కేంద్రంగా మారిన వైనం
- మందు బాబులు, పేకాటరాయుళ్ల ఇష్టారాజ్యం

మండలంలోని మోపిడి, లత్తవరం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్ఎస్‌కే కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు రూ.లక్షలు వెచ్చించి నిర్మించారు. భవనాలు ప్రారంభిస్తే గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న ఆలోచనే కూటమి ప్రభుత్వం వాటిని ప్రారంభించకుండా వదిలేసింది. భవనాలు నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారాయి.



ఆరోగ్య కేంద్రానికి వెనుక వైపు దోరు తొలగించిన వైనం

మోపిడిలో నూతన గదుల్లో వ్యభిచారం..

మండలంలోని మోపిడి గ్రామంలో సచివాలయం, ఆర్ఎస్‌కే కేంద్రాలతో పాటు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. ఇందులో కేవలం సచివాలయం ఒక్కటే పనిచేస్తుండగా మిగతా భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో కొందరు ఆకతాయిలు ఆరోగ్య కేంద్రానికి ఉన్న ద్వారాన్ని వెనుక వైపు నుంచి తొలగించి, అందులో విచ్చలవిడిగా మద్యం, పేకాట కేంద్రాలుగా మార్చారు. తాజాగా మహిళలను తెచ్చుకొని వ్యభిచార కేంద్రంగా మార్చినట్లు బహిరంగా ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ భవనాల్లో ఇంత విచ్చలవిడిగా అసాంఘిక కార్యాకలాపాలు జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు. ఆరోగ్య కేంద్రం భవనంలో పలు గదుల్లో కండోం ప్యాకెట్లు, మద్యం సీసాలు కనిపిస్తున్నాయి.



ఆరోగ్య కేంద్రంలో కండోం ప్యాకెట్లు, మహిళల దుస్తులు



ఆరోగ్య కేంద్రంలో మద్యం బాటిళ్లతో నిండి ఉన్న గది

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట



మోపిడి గ్రామంలో ఆరోగ్య కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. ఆరోగ్య కేంద్రానికి మరో తలుపు ఏర్పాటు చేసి, లోపలికి ఎవరు ప్రవేశించకుండా చూస్తాం.

– రవిచంద్ర, ఎంపీడీఓ, ఉరవకొండ

చర్యలు తీసుకోవాలి..



కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో గ్రామంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. కొందరు ఆకతాయిలు ఆరోగ్య కేంద్రం తలుపులు ధ్వంసం చేశారు. దీనికితోడు భవనాన్ని మద్యం, పేకాటతో పాటు ఇతర అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చారు. అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– సిద్ధా, సర్పంచ్, మోపిడి

భవనాలు ప్రారంభించాలి..



మోపిడిలో రైతు భరోసా కేంద్రంతో పాటు ఆరోగ్య కేంద్రాన్ని గత వైఎస్సార్‌సీపీ హయంలో రూ.లక్షలు వెచ్చించి అత్యాధునిక వసతులతో నిర్మిస్తే, వాటిని ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. వెంటనే నూతన భవనాలు ప్రారంభించాలి.

– బోయ ఆనంద్, మోపిడి

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



రాయదుర్గంలో ఐసీడీఎస్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



ఉరవకొండలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

రాయదుర్గంటౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం ఆందోళన చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి వర్కర్ల యూనియన్ నాయకులు, సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అక్కడ కార్యాలయం ముందు గంటపాటు బైఠాయించి, నిరసన తెలియజేశారు. అంగన్వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చు చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్కర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందమ్మ, మేరి, కోశాధికారి రాధమ్మ, వర్కర్లు పాల్గొన్నారు.

కణేకల్లు: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం ధర్నా చేశారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు వేతనాలు సీఐటీయూ ఆధ్వర్యంలో వేతనాలు పెంచాలని ధర్నా చేశారు. ధర్నా అనంతరం సీనియర్ అసిస్టెంట్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు.

మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

ఉరవకొండ: అంగన్‌వాడీ కార్యకర్తలను మూడోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఉరవకొండ సీడీపీఓ కార్యాలయం ఎదుట ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సీఐటీయూ సుదీర్ఘ పోరాటాల ఫలితంగా అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని, అలాగే 11 రకాల హామీలు పరిష్కరిస్తామని చెప్పినట్లు గుర్తు చేశారు. కానీ ఎనిమిది నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ధనలక్ష్మి, విజయ, సత్యవతి, రైతుసంఘం నాయకులు రంగారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహులు

కళ్యాణదుర్గం రూరల్: ఉద్యాన శాఖ అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమమాహేశ్వరి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహులు, పీడీ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణదుర్గం డివిజన్ అగ్రికల్చర్ అధికారులతో ఉద్యాన శాఖ అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఉద్యానశాఖ జిల్లా అధికారి, డీఏఓ మాట్లాడుతూ మామిడి, చీనీ, దానిమ్మ, ద్రాక్ష రైతులకు 50 శాతం రాయితీతో స్ప్రేయర్లు ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ యల్లప్ప, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

అటవీప్రాంతం పరిశీలన

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల అటవీ ప్రాంత సమీపంలో ఆదివారం రాత్రి అగ్నికి ఆహుతైన పంటలను అధికారులు సోమవారం పరిశీలించారు. కెంచంపల్లి చెందిన మహిళా రైతు లక్ష్మమ్మకు చెందిన డ్రిప్ పరికరాలు, మోటార్ బైక్, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయాయి. రెవెన్యూ,ఫారెస్టు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్ఓ రాజశేఖర్, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతుల్లో అలసత్వం



పైపులైన్ లీకేజీతో నీరు రోడ్డుపై పారుతున్న దృశ్యం

కూడేరు: ఎంపీడీఓ కార్యాలయంలో నిర్మించిన సచివాలయాలు–1,2 లకు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపులైన్ లీకేజీతో పెద్ద ఎత్తున నీరు సచివాలయం–2, వ్యవసాయ కార్యాయం వైపు పారుతోంది. దీంతో కార్యాలయాలకు వెళ్లే దారి, ముందు భాగం బురదమయమైంది. అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ కనెక్షన్లతోనే నీటి సమస్య

కణేకల్లు: మండలంలోని జక్కలవడిలో అక్రమ కొళాయి కనెక్షన్లతోనే నీటి సమస్య తలెత్తిందని గ్రామ సర్పంచు పి.శారదమ్మ తెలిపారు. ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక పైప్‌లైన్ వేశామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత కొందరు స్వార్థ పరులు పైప్‌లైన్‌కు రంధ్రాలు వేసి, అక్రమంగా కనెక్షన్లు తీసుకున్నారన్నారు. ఎక్కడబడితే అక్కడ పైపులైన్‌కు రంధ్రాలు వేసి నీరు తీసుకుంటుండడంతోనే దిగువ కాలనీకి నీరు సక్రమంగా పోలేదన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్పందించకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

శివమాలధారుల ఊరేగింపు



ఊరేగింపుగా వస్తున్న శివమాలధారులు

రాయదుర్గం: పట్టణంలోని బళ్లారి రోడ్డుమీదుగా లక్ష్మీబజార్ వరకు శివమాలధారులు గుర్రాల పల్లకీలో శివలింగాన్ని వైభవంగా ఊరేగించారు. ఈనెల 20న శ్రీశైలం వెళ్లనున్నారు. భంభం స్వామి దారిలోని శివాలయం వద్ద వేలాది మందికి భిక్ష ఏర్పాటు చేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్‌కేఎల్ జ్ఞానప్రసూన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి అర్హత పరీక్ష (బీఆర్‌ఏజీ సెట్) ద్వారా ఇంగ్లిషు మీడియంలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఇందులో 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంఈసీలో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు ఉంటాయన్నారు. మార్చి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు సెల్: 9573582804, 9490363701లో సంప్రదించాలన్నారు.

జోడులింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో జోడు లింగాలు

కూడేరు: పార్వతీపరమేశ్వర జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో మాఘ మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. జోడులింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

రైతు విశిష్ట సంఖ్య ఉంటేనే పథకాల వర్తింపు

ఉరవకొండ: రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య (ఏపీఎఫ్ఆర్) కలిగి ఉంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు రైతులు అర్హులవుతారని ఏఓ శుభకర్ తెలిపారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడారు. రైతులకు భవిష్యత్తులో 11 అంకెల విశిష్ట సంఖ్య ఉంటేనే పీఎం కిసాన్ నిధులు, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారాలు వర్తిస్తాయన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలో ఈనెల 18 నుంచి 21 వరకు, 24 నుంచి 28 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18, 19,20,21 తేదీల్లో నేతాజీ రోడ్డులోని దబ్బడి కాంప్లెక్స్‌లోని ఐదో సచివాలయంలో, 24,25,26,27,28 తేదీల్లో కణేకల్లు రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా గల 6వ వార్డు సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాలు ఉంటాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డ్‌కు గాయాలు

కూడేరు: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ సెక్యూరిటీ గార్డ్ వెంకటరెడ్డికి గాయాలయ్యాయి. సోమవారం వేకువజామున గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు వెంకటరెడ్డిని పిలిచారు. అతను అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి దాటే క్రమంలో ద్విచక్ర వాహనదారుడు వెంకటరెడ్డిని ఢీకొట్టాడు. గాయపడిన వెంకటరెడ్డిని పోలీసులు చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

మొక్కజొన్న పంటకు నిప్పు

బెళుగుప్ప: కాలువపల్లికి చెందిన రైతులు శ్రీనివాస రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవినాథ్‌రెడ్డికి చెందిన వ్యవసాయ తోటలో డ్రిప్ వైర్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో 8 ఎకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా మంజునాథస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజస్తంభ ప్రతిష్ట చేస్తున్న సరున్మోహన్ తంత్రి



నవగ్రహాల ప్రతిష్ట నిర్వహించిన దృశ్యం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథస్వామి ఆలయం వద్ద సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ట వైభవంగా జరిగింది. మళయాళ పండితులు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి ఆధ్వర్యంలో ప్రతిష్ట నిర్వహించారు. నవగ్రహాలను ప్రాణ ప్రతిష్ట పూజలు చేశారు. దాతలు కె.అనంతమ్మ, కీర్తిశేషులు రామిరెడ్డితనయుడు సోమశేఖర్ అన్నదానం చేశారు.

లోక కల్యాణార్థమే హోమాలు

లోక కల్యాణార్థమే హోమాలు యాగాలను చేస్తున్నట్లు సరున్మోహన్ తంత్రి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మా ట్లా డారు. ఈఏడాది దుబాయిలోని అబుదాబి, బెంగళూ రులో మహాశివరాత్రి యాగాలు, కొయంబత్తూరులో లక్ష్మీకుబేరయాగం పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అర్జీదారుల ఎదుటే సమస్యపై ఆరా



వినతులు స్వీకరిస్తున్న ట్రైనీ కలెక్టర్ వినూత్న

కూడేరు: మండల తహసీల్దార్‌గా ట్రైనీ కలెక్టర్ వినూత్న బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మూడు నెలలుగా కార్యక్రమానికి హాజరుకాని అధికారులు.. సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురు భూసమస్యలు పరిష్కరించాలని వినతులు ఇచ్చారు. సంబంధిత అధికారులను పిలిచి వారి ఎదుటే సమస్యపై ఆరా తీశారు. 20 రోజుల్లోపు సమస్యలు పరిష్కరించాలని ట్రైనీ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి డీటీ సూర్య ప్రతాప్, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, సీడీపీఓ శ్రీదేవి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఏపీఎం దేవానంద ఫిలిప్స్‌న్, పశు వైద్యాధికారి శ్వేత, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, పీఆర్ ఏఈ రమణయ్య, ఏపీఓ తులసీ ప్రసాద్, ఈఓఆర్డీ రాధాకృష్ణ, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, అధికారులు హాజరయ్యారు.

అపిలేపల్లి వీఆర్వోపై చర్యలు తీసుకోండి

కళ్యాణదుర్గం: కుందుర్పి మండలం అపిలేపల్లి వీఆర్వో వెట్టి తిమ్మయ్యపై చర్యలు తీసుకోవాలని దళిత జన జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కే రాజు కోరారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ తిమ్మయ్య కంబదూరులో పని చేసినప్పుడు కూడా వివాదాస్పదుడిగా ఉన్నారన్నారు. స్వగ్రామం తగరకుంటలోనూ తన పేరిట అక్రమంగా 5 ఎకరాలు భూమి ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడన్నారు. అపిలేపల్లిలో భూ సమస్యల పరిష్కారం పేరుతో ఒక్కో రైతుతో భారీగా వసూలు చేశారన్నారు.

జంబుకేశ్వరస్వామికి విశేష పూజలు



తేనె చామంతి పుష్పాల అలంకరణలో జంబుకేశ్వరుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు జరిగాయి. తేనె చామంతి పూలతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. స్వామికి పంచామృతాభిషేకం, ఏకబిల రుద్రాభిషేకం, కుంకుమ అర్చన, మంగళనైవేద్యాలు చేశారు. యమున అనే భక్తురాలు 10 కేజీల తేనె చామంతి పుష్పాలతో అలంకరించి పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు.

పథకాలపై అవగాహన

శెట్టూరు: వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాబృందం తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న అనుంపల్లి, తిప్పనపల్లి, ఐదుకల్లు, యాటకల్లు, 19న చిన్నంపల్లి, బచ్చేహళ్లి, అయ్యగార్లపల్లి, కనుకూరు గ్రామాల్లో 20న కైరేవు, చెర్లోపల్లి, లక్ష్మంపల్లి, మాకోడికిలో, 21న ములకలలేడు, పెరుగుపాళ్యం, చింతర్లపల్లి, శెట్టూరు గ్రామాల్లో తడిచెత్త- పొడిచెత్త వేరు చేయడం, పరిసరాల శుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, దోమల నివారణ, ఆరుబయట మూత్రవిసర్జన తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9912220732, 9010470185